Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

सत्यमेव जयते

తేదీ:30.11.2017

**పోలవరం పై ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి గారికి బహిరంగ లేఖ**

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి,

నవంబర్ 21న, శాసన సభలో మీ స్వజనుల కరతాళ ధ్వనుల మధ్య సాగిన **"పోలవర చారిత్రక గాథా లహరి" లో కొన్ని "ఎంపిక చేసిన" ఘట్టాల గానం** మీ వంధిమాగధ బృందాలకు వీనుల విందు చేసింది. అయితే మీ గానంలో **పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ఘనత అంతా మీకే చెందాలనే దురాశ వల్ల కొన్ని అసత్యాలు, అర్ధసత్యాలు చేర్చడంతో**.. మీ గాథాలహరిని కనీసం పోలవరం పై ప్రేమతోనైనా ఆస్వాదించాలనుకొన్న మావంటివారికి అపశ్రుతులు వినిపించాయి.

అయితే పోలవరం పై ఇప్పటికైనా శాసనసభలో ఒక ప్రకటన చేసినందుకు ధన్యవాదాలు. పోలవరాన్ని పూర్తిచేయడమే మీ జీవితాశయమని ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మీరు ప్రకటించడం చాలామంది ఆంధ్ర ప్రజలతో పాటు నాకు ఆనందాన్ని కలిగించింది. **అయితే ప్రభుత్వాధినేతగా, శాసనసభా నాయకుడిగా మీరు నిజాయతీగా పోలవరం విషయం లో వాస్తవాలను వెల్లడిస్తారని ఆశించిన మావంటి వారికి మీరు గట్టి షాక్ ఇచ్చి**..వేదిక ఏది ఐనా, అది పత్రికా సమావేశమైనా లేదా శాసనసభ ఐనా **మీది అసత్యాలు చెప్పడానికి వెనుకాడే మనస్తత్వం కాదని** నిరూపించుకొన్నారు.

**1981 లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి అంజయ్య గారి కాబినెట్ లో మంత్రిగా ఉండి కూడా,** అప్పట్లో **పోలవరం ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేసిన అంజయ్య గారి పేరుని గానీ, 2004 -2014 ల మధ్య ప్రాజెక్ట్ కు అన్నీ అనుమతులు సాధించి ప్రాజెక్ట్ టెండర్లు ఫైనలైజ్ చేసి, కాలువలు తవ్వకం దాదాపు పూర్తి చేయించిన వై.యస్.రాజశేఖర రెడ్డితో సహా కాంగ్రెస్ ముఖ్యమంత్రుల పేర్లు గానీ ప్రస్తావించకుండా**..పోలవరం చరిత్ర పాఠాలు చెప్పిన మీ వంచనా చాతుర్యానికి..మీ భజన బృందం బల్లదరువులతో జేజేలు పలికినా..**సమకాలీన చరిత్రకు మసిపూయాలనుకొన్న మీ ప్రయత్నం సఫలం కాలేదు.**

అయితే 1980-2014 ల మధ్య పోలవరం చరిత్రను చెప్పకుండా.. అలవోకగా పోలవరం చరిత్రను సింహావలోకనం చేసిన మీరు **1996 -2004 మధ్య మీ హయాం లో మీరు పోలవరానికి చేసినది ఏమిలేదని చెప్పకనే చెప్పారు.**

**2014 కు ముందు ఎప్పుడు** "పోలవరం" అన్న మాట మీ నోట ఎప్పుడు రాకపోయినా.. అప్పటివరకు కనీసం పోలవరం **ప్రాజెక్ట్ నిర్మాణ స్థలాన్ని మీరు కనీసం ఒక్కసారిఅయినా చూడకపోయినా**..2014 లో పదవిలోకి రాగానే మాత్రం - పోలవరాన్ని మీ కలగా ఆపాదించుకొని **-1978 లో మదనపల్లిలో ఏ మహానుభావురాలికి సాష్టాంగ**



H.No. 8-2-544/101, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034. Ph : 040 - 23357513.
email : kvprrao@yahoo.com

Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

सत्यमेव जयते

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

ప్రణామాలు ఆచరించి కాంగ్రెస్ పార్టీ బి-ఫారం సంపాదించి మీ రాజకీయ జీవితానికి పునాది వేసుకున్నారో.. ఆ మహానుభావురాలి పేరునే పోలవరం ప్రాజెక్ట్ నుంచి తొలగించి ఆవిడ ఆత్మకు ద్రోహం చేసి.. పిల్లనివ్వడంతో పాటు, రాజకీయ పునర్జీవనాన్ని ప్రసాదించిన యస్.టి. రామారావు గారికే వెన్నుపోటు పొడవడం ద్వారా మీరు సంపాదించుకొన్న "వెన్నుపోట్లకు బ్రాండ్ అంబాసిడర్" బిరుదు మీకు సార్ధకమే అని మరోమారు రుజువు చేసుకొన్నారు.

జీవిత ఆశయాలు, జీవిత లక్ష్యాలు చిన్నప్పుడో, విద్యార్థి దశలోనే ఏర్పడతాయని తెలుసుగాని, **పోలవరం నిర్మాణ అవకాశం చేతికి చిక్కగానే పోలవరం నిర్మాణమే మీ జీవితాశయం అయినదని** .. మాకు ఇప్పుడే తెలిసింది. చిన్నప్పుడే కొన్ని ఆశయాలు, లక్ష్యాలు ఏర్పరుచుకొని, వాటిని ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కష్టించి సాధించిన మహానుభావులగురించి విన్న మాబోటి వారికి.. **అవసరానికి అనుగుణంగా మారే ఈ జీవితాశయాలు కొత్తగా అనిపిస్తున్నాయి.**

పోలవరం గురించి మీరు ఇచ్చిన స్టేట్ మెంట్ వల్ల- **పోలవరం నిర్మాణంలో కండలు కరిగించి రాళ్లు ఎత్తుతున్న కూలీల సంగతి, స్వేదం చిందిస్తున్న కార్మికుల స్థితి, అహర్నిశలు శ్రమిస్తున్న ఇంజినీర్ల పరిస్థితి ఎలా ఉన్నా**, విరివిగా పోలవరం క్షేత్ర సందర్శనతో పాటు, తరచూ వర్చ్యువల్ తనిఖీలు, ఇక ప్రతి "పోల" వారం నాడు సమీక్షలతో మీరు **పోలవరం కోసం చెమటోడ్చుతున్న వైనం జాతికి తెలిసివచ్చింది.**

ఇక **పోలవరాన్ని జాతీయ ప్రాజెక్ట్ గా విభజన చట్టం ద్వారా ప్రకటించిన యూపీఏ ప్రభుత్వ ప్రమేయం గానీ, పోలవరం ముంపు మండలాలను ఆంధ్ర ప్రదేశ్ లో కలపాలని 2 మార్చ్ 2014న తీర్మానంచేసిన యూపీఏ కాబినెట్ ప్రమేయం గానీ** లేకుండానే-ఎవరు చెప్పకుండానే, కర్ణుడికి కవచకుండలాల్లా **మీకు సహజసిద్ధంగా అబ్బిన ఇంట్యూషన్ మరియు దూరదృష్టి వల్ల** హఠాత్తుగా తెరుచుకున్న జ్ఞాననేత్రంతో మీరు **"ప్రమాణస్వీకారమే" చేయనని బెదిరించి, మోడీ మెడలు వంచి, ముంపుమండలాలను ఆంధ్రాలో వెంటనే కలపడం తప్ప కేంద్రానికి వేరే గత్యంతరం లేని పరిస్థితి కలిగించి**, పోలవరం నిర్మాణానికి మార్గం సుగమంచేసిన.. **మీ చాణక్యం గురించి విని జాతి** పులకించింది.

అయితే, **ప్రజాస్వామ్యంలో అత్యంత ఉన్నతమైన శాసనసభ సాక్షిగా మీరు అసత్యాలు వల్లె వేయడం, జనం కళ్లకు గంతలు కట్టాలని చూడడం** ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించేవ్యక్తి గా నేను సహించలేక **మీకు మళ్ళీ ఈ లేఖ రాయవలసి వస్తున్నది.**



H.No. 8-2-544/101, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034. Ph : 040 - 23357513.
email : kvprrao@yahoo.com

Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

सत्यमेव जयते

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

01.05.2014 న మన్మోహన్ సింగ్ గారి అధ్యక్షతన జరిగిన కాబినెట్ సమావేశంలో పోలవరం కాస్ట్ ఎస్కలేషన్ తో పాటుగా పునరావాసాల ఖర్చుతో సహా కేంద్రమే పూర్తిగా భరించి పోలవరాన్ని తామే నిర్మించాలని నిర్ణయం తీసుకొంటే..మధ్యలో బీజేపీ ప్రభుత్వం "ప్రాజెక్ట్ నిర్మాణాన్ని రాష్ట్రానికి అప్పగించమని" మీరు కోరినందున 01.04.2014 నాటి అంచనాల ప్రకారమే పోలవరం ఖర్చును భరిస్తామని పెట్టిన కండిషన్ ను శాసన సభ సాక్షిగా చదివి కూడా మీరు, కేంద్రంతో నిధుల విషయంలో సమస్య ఏమిలేదని చెప్పడం చూస్తే.. మీరు కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడడానికి తీవ్రంగా భయపడుతున్నారని, కేంద్రం విదిలించిన నిధులే తీసుకొని రాష్ట్రం పై భారం వేసి పోలవరం నిర్మించడానికి సిద్ధం అవుతున్నారని స్పష్టంగా అర్ధం అవుతున్నది. పోలవరం పూర్తి ఖర్చును భరించాల్సిన కేంద్రం రకరకాల కండిషన్స్ పెడుతూ వుంటే, కేంద్రంతో రాజీ పడి.. పదేపదే మీ ప్రకటనలో మీరు కేంద్రానికి ధన్యవాదాలు తెలపడమే మీ నిస్సహాయతను తెలియచేస్తున్నది.

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన అన్ని ప్రభుత్వపరమైన అనుమతులు సాధించి.. ప్రాజెక్ట్ నిర్మాణాన్ని కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిన తరువాత - మీ రెండు లేఖలతోనే అంకురార్పణ జరిగిన రాష్ట్ర విభజన ప్రతిపాదన.. అన్నిపార్టీల అంగీకారంతో చట్ట రూపం దాల్చే పరిస్థితి వచ్చినప్పుడు.. అప్పటి యూపీఏ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ కు అన్యాయం జరగగూడదని.. ఆంధ్ర ప్రదేశ్ కు జీవనాడి అని భావించిన పోలవరం ప్రాజెక్ట్ ను జాతీయ ప్రాజెక్ట్ గా ప్రకటించి, దీనికి సంబంధించి అన్ని అనుమతులు కేంద్రమే తెచ్చి.. ప్రాజెక్ట్ ను పూర్తి గా కేంద్రమే నిర్మించాలని చట్టం చేసి, ముంపు మండలాలను ఆంధ్ర లో కలపడానికి అవసరమైన బిల్లు ను తరువాత వచ్చే పార్లమెంట్ సమావేశాలలో ప్రవేశపెట్టాలని, ప్రాజెక్ట్ పై కాస్ట్ ఎస్కలేషన్ తో పాటు.. పునరావాసానికి అయ్యే అదనపు ఖర్చు తో సహా ప్రతి పైసా కేంద్రమే భరించాలని నిర్ణయిస్తూ యూపీఏ కాబినెట్ తీర్మానం కూడా చేస్తే.. ఇంకా కాంగ్రెస్ ఏదో ద్రోహం చేసిందని.. పోలవరం కల మీవల్లే సాకారమైందని మీరు గోబెల్స్ ప్రచారం చేసుకొంటూ.. దాన్ని ప్రజలు నమ్ముతారనుకోవడం మీ అత్యాశ.

పోలవరం నిధులు విషయంలో కేంద్రం నాటకాలు, మీ నిష్క్రియాపరత్వం చూసే, రాష్ట్ర ప్రజలపై అదనపు భారం పడకూడదనే ఉద్దేశ్యంతోనే నేను పోలవరం పూర్తి ఖర్చును విభజన చట్టాన్ని అనుసరించి కేంద్రమే భరించేలా ఆదేశాలు ఇవ్వవలసినదిగా కోరుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగింది.

ఇక విషయం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని చేరిందని తెలియడం వల్లనే.. మీరు శాసనసభలో పోలవరం పై హఠాత్తుగా ప్రకటన చేయవలసిన పరిస్థితి ఏర్పడింది అనేది వాస్తవం కాదా!



H.No. 8-2-544/101, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034. Ph : 040 - 23357513.
email : kvprrao@yahoo.com

Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

सत्यमेव जयते

అయితే మీ ప్రకటనలో ఉన్న అసత్యాలు, అర్ధసత్యాల వల్ల పోలవరం నిధుల విషయంలో గందరగోళ పరిస్థితి ఏర్పడినందున, దీన్ని తొలగించవలసిన బాధ్యత పోలవరం అనుమతుల సాధనలో, నిర్మాణం లో ఎంతో కొంత ప్రమేయం ఉన్న ఒక ప్రజా ప్రతినిధి గా నాకూ ఉన్నది అని భావించి ఈ క్రింది విషయాలలో మీ వివరణను కోరుతున్నాను.

-- 2014 కు ముందు పోలవరం అనేమాట మీనోటి నుంచి వచ్చిందని చెప్పటానికి గానీ లేదా కనీసం మీరు ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాన్ని ఒకసారైనా చూశారనడానికి ఏమైనా సాక్ష్యాలు ఉన్నాయా?

-- పోలవరం ముంపు మండలాల విషయం హఠాత్తుగా 26 మే 2014 న మీకు గుర్తుకు రావడానికి కారణం మీ "ఇంట్యూషన్ మరియు దూరదృష్టా" లేక సీనియర్ కాంగ్రెస్ యంపీ జైరాం రమేష్ సలహానా?

-- పోలవరం చరిత్ర ప్రతివారు తెలుసుకోవాలంటూ హితబోధ చేసిన మీకు తెలిసిన పోలవరం చరిత్ర 1941 నుండి మొదలై 1979 వద్ద ఆగిపోయి మళ్ళీ 2014 వద్ద మొదలైందా? మధ్యలో జరిగిన చరిత్ర మీకూ తెలియదా లేదా తెలిసినా ఎందుకు చెప్పలేకపోతున్నారు?

-- పోలవరం ప్రాజెక్ట్ మొదలు పెట్టడానికి కావాల్సిన అనేక అనుమతులు ఎప్పుడు వచ్చాయో, అవి లేకపోతే పోలవరం నిర్మాణం ఏమయ్యేదో మీకు తెలియదా?

-- పోలవరం కాలువలు పూర్తిగా తవ్వకుండా అడ్డుపడింది, 2009 లో పోలవరం కాంట్రాక్టులు రద్దు అయినతరువాత మళ్ళీ కొత్త టెండర్లు పిలువకుండా కోర్టులను ఆశ్రయించింది మీ పార్టీ వారు కాదా?

-- పోలవరం నిర్మాణ బాధ్యత కేంద్రం నుంచి మీరు అడిగితీసుకొన్నారని కేంద్ర ఆదేశాలు స్పష్టంగా చెపుతుంటే, మేమేమి అడగలేదు..నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు కేంద్రమే ఇచ్చిందని శాసనసభలో మీరు చెప్పడం అబద్ధం కాదా? ఒక ముఖ్యమంత్రి సభను, ప్రజలను ఇలా తప్పుదోవ పట్టించవచ్చా? శాసన సభలో అంతా మీవారే కాబట్టి . ఇలా శాసనసభను తప్పు దోవ పట్టించినందుకు మీపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చే ధైర్యం ఎవరికీ లేదనే నమ్మకంతోనే కదా?

-- యూపీఏ ప్రభుత్వం పోలవరం నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును కాస్ట్ ఎస్కలేషన్ తో పాటుగా పునరావాసం కార్యక్రమాల ఖర్చుతో సహా మొత్తం తామే భరిస్తామని 01.05.2014 నాటి కాబినెట్ లో నిర్ణయం తీసుకొంటే, కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం 01.04.2014 నాటి ఎస్టిమేట్స్ ప్రకారమే భరిస్తామని కండిషన్ పెట్టిన మాట వాస్తవం కాదా?

-- ఈ విషయాన్ని శాసనసభలో చదివి వినిపించిన మీరు మళ్ళీ పోలవరం ఖర్చు మొత్తం కేంద్రమే భరిస్తానంటున్నదని చెప్పడం మీరు భాషను అర్థం చేసుకోలేకపోవడం వల్లనా.. లేదా జనానికి అర్థం కాదనే ధైర్యమా?

-- కేంద్రం 2013-14 అంచనాల ప్రకారం నిధులు ఇస్తే మీరు 08.09.2016న ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులలో పోలవరం హెడ్ వర్క్ అంచనాలను 2015-16 నాటికి సవరించిన అంచనాల ప్రకారం ఆమోదించడం వల్ల పడే అదనపు భారం



H.No. 8-2-544/101, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034. Ph : 040 - 23357513.
email : kvprrao@yahoo.com

Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

सत्यमेव जयते

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

ఎవరు భరించాలి.. రాష్ట్రం కాదా? అదేవిధంగా మీరు 06.12.2016 న సవరించిన పోలవరం కుడి, ఎడమ కాల్వలపై ఖర్చుల వల్ల పడే అదనపుభారం రాష్ట్ర ఖజానా పై వేయడానికి సిద్ధపడింది నిజం కాదా?

-- పోలవరానికి 2013-14 నాటికి సవరించిన అంచనాలను 16.08.2017 ననే కేంద్రానికి మీరు పంపిస్తే.. మూడు నెలలైనా అవి ఆమోదం ఎందుకు పొందటం లేదు? అంచనాలు తప్పుల తడకలని కేంద్రం పదే పదే వివరణలు కోరడం వల్ల కాదా?

-- జాతీయ ప్రాజెక్టు గా ప్రకటించినందున పోలవరానికి ఇచ్చే మొత్తం కేంద్ర సహాయం గ్రాంట్-ఇన్-ఎయిడ్ గా ఇవ్వాలని యూపీఏ కాబినెట్ నిర్ణయిస్తే..దాన్ని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి డైరెక్ట్ గా ఇవ్వకుండా నాబార్డ్ ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది నిజం కాదా?

-- నాబార్డ్ ఈ నిధులు విడుదల చేసేటప్పుడు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ కి/ రాష్ట్ర ప్రభుత్వానికి పలు కండిషన్ లు పెట్టింది నిజం కాదా.. వాటికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది నిజం కాదా?

-- ఈ కండిషన్ లలో ప్రాజెక్ట్ ను సకాలంలో పూర్తి చేయకపోతే, గ్రాంట్ మొత్తాన్ని లోన్ గా మారుస్తామని, అనుమతి లేకుండా ప్రాజెక్ట్ వ్యయ అంచనాలు పెంచకూడదని, ఒక వేళ కాంపిటెంట్ అథారిటీ అనుమతి లేకుండా అంచనాలు పెంచితే ఆ అదనపు భారాన్ని రాష్ట్రమే భరించాలని చెప్పింది నిజం కాదా?

.. మీరు హెడ్ వర్క్, ఎడమ, కుడి కాలువలు అంచనాలను కాంపిటెంట్ అథారిటీ అనుమతి లేకుండా పెంచి..ఈ అదనపు భారాన్ని మోయడానికి సిద్ధపడింది నిజం కాదా?

-- మీరు పోలవరం హెడ్ వర్క్ మెయిన్ కాంట్రాక్టర్ నుండి కొన్ని పనులను వేరుచేసి వేరే కాంట్రాక్టర్ కు ఇవ్వాలని ప్రతిపాదించినపుడు..కాంట్రాక్టర్ ను మారిస్తే అదనపు భారం పడుతుందని కేంద్ర మంత్రి గడ్కరీ తిరస్కరించింది నిజం కాదా?

- ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ఖజానాపై వేసి అయినా.. హెడ్ వర్క్స్ కాంట్రాక్టర్ నుంచి కొన్ని పనులను తప్పించి వేరే కాంట్రాక్టర్ ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం 01.11.2017 న నిర్ణయం తీసుకున్నది నిజం కాదా? ఆ నిర్ణయం మేరకు 1500 కోట్ల రూపాయల పనులకు మళ్ళీ టెండర్లు పిలిచింది నిజం కాదా? ఈ భారాన్ని కేంద్ర భరిస్తుందా? రాష్ట్ర ప్రజలు భరించాలా?

-- నాబార్డ్ ద్వారా 2015-2016 నుండి 2019-2020 నాటికి కేంద్రం 23814 కోట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నదని గర్వంగా ప్రకటించిన మీకు.. మీరే చెప్పినట్లు మొత్తం ప్రాజెక్ట్ కు కావలసిన నిధులు 54000 కోట్లలో ఇవి సగం కూడా లేవని తెలియడం లేదా?

-- మీరు చెపుతున్నట్లు కేంద్రం మార్చ్ 2020 నాటికి కేవలం 23814 కోట్ల నిధులే ఇస్తే, పోలవరం ప్రాజెక్ట్ కు కావలసిన మిగతా 30000 కోట్లు ఎక్కడినుంచి తెస్తారు? ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తి అవుతుంది?



H.No. 8-2-544/101, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034. Ph : 040 - 23357513.
email : kvprrao@yahoo.com

Dr. K.V.P. Ramachandra Rao
MEMBER OF PARLIAMENT
(RAJYA SABHA)

सत्यमेव जयते

#10, Lodhi Estate
New Delhi - 110 003
Ph : 011 - 24644656
Fax: 011 - 24642528

-- అంటే ప్రాజెక్ట్ ను 2019 నాటికి మేము పూర్తి చేస్తామని మీరే పదే పదే చెప్పడం జనాన్ని మాయచేయడం కాదా?

-- కేంద్ర నిధులతో ఏ సమస్య లేదని, 2019 కల్లా పోలవరాన్ని ఖచ్చితం గా పూర్తి చేస్తామని నొక్కి వక్కాణిస్తున్నమీకు, నిజంగా ప్రాజెక్ట్ ను 2019 నాటికి పూర్తి చేసి గ్రావిటీ ద్వారా ఎడమ కాల్వకు నీరు ఇచ్చే అవకాశం ఉన్నప్పుడు, దాదాపు 1800 కోట్లు ఖర్చుపెట్టి తాత్కాలికమైన పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు మీరు ఎందుకు ఉరకలు వేస్తున్నారు?

.. పోలవరం నిర్మాణంపై, నిధులపై ఇంత గందరగోళం ఉన్నప్పుడు మీరు పోలవరం పై ఒక శ్వేతపత్రం ఎందుకు ప్రకటించరు?

పోలవరం పై  మీరు శాసనసభలో చేసిన ప్రకటన వల్ల .. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పై, నిధులపై ప్రజలలో ఉన్న గందరగోళం, అయోమయం ఇంకా పెరిగింది. పోలవరం నిర్మాణం మీ చేతులలోకి తీసుకోవడానికి మీరు కేంద్రం తో ఏమి ఒప్పందం చేసుకున్నారో తెలియదు.  కానీ విభజన చట్టానికి వ్యతిరేకం గా పోలవరం ఖర్చు ను 01.04.2014 అంచనాల ప్రకారమే మాత్రమే భరిస్తామని కేంద్రం కొత్త వాదనను తెరమీదకు తీసుకువచ్చినది.  దీనివల్ల రాష్ట్రానికి భారీ నష్టం జరిగే అవకాశం ఉన్నది. ఇది తెలిసీ, కారణాలు ఏవైనా మీరు కేంద్రాన్ని నిలదీసే పరిస్థితిలో లేరు. ఇప్పటికైనా వాస్తవాలను ప్రజలముందు ఉంచకపోతే.. మీ వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుంది.  కాబట్టి పోలవరం నిధుల విషయంలో వాస్తవాలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి వెంటనే నివేదించవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించండి. లేదా మిమ్ములను నమ్ముకొని, ఎన్నుకొన్న ప్రజలకు తీరని నష్టం చేసిన వారు అవుతారు అని గ్రహించండి.

అభినందనలు తో

భవదీయుడు,

కె.వి.పి. రామచంద్ర రావు.

(డా.కె.వి.పి.రామచంద్ర రావు)

శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

గౌరవ ముఖ్యమంత్రి, ఆంధ్ర ప్రదేశ్



H.No. 8-2-544/101, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034.  Ph : 040 - 23357513.
email : kvprrao@yahoo.com